www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 7 డిసెంబర్ 2024

5

పెద్దదర్గాలో హీరోయిన్ అంజలి ప్రార్థనలు

ప్రజాశక్తి-కడప సిటీ

నగరంలోని అమీన్‌పీర్ పెద్ద దర్గాను ప్రముఖ సినీ నటి అంజలి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. దర్గాకు చేరుకున్న ఆమెను దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. తాను మొదటి సారిగా దర్గాకు వచ్చానని, చాలా ప్రశాంతంగా ఉందని తెలిపారు. తాను నటించిన గేమ్‌చేంజర్ సినిమా త్వరలో విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు.

ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీనటి అంజలి

ట్రూ'అప్' షాక్!

- ప్రజలపై విద్యుత్ ఛార్జీల బాదుడు - జిల్లాపై నెలకు రూ.7.1 కోట్ల భారం

ప్రభుత్వం ట్రూఅప్ పేరిట కరెంటు ఛార్జీలను పెంచేసింది. ఈ ఏడాది డిసెంబర్ నుంచే విద్యుత్ ఛార్జీలను పెంచేసింది. యూనిట్‌కు సగటున 61 పైసల చొప్పున పెంచి వసూలు చేస్తోంది. జిల్లాపై నెలకు రూ.7.1 కోట్ల మేర భారం వేయడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయాధారిత జిల్లాలో పేద, ధనికులనే బేధం చూపకుండా ధనికులతో సమానంగా పేదలందరికీ విద్యుత్ ఛార్జీల పెంపుదలను వర్తింప జేయడం పట్ల సర్వత్రా విమర్శల వర్షం కురుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 11.19 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 8.19 లక్షల గృహాల కనెక్షన్లు, 91 వేల వాణిజ్య కనెక్షన్లు, 4,195 పరిశ్రమల కనెక్షన్లు, 27,600 ప్రభుత్వ కార్యాలయాలు, 1.76 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో హెచ్‌విడిఎస్ 267 సబ్‌స్టేషన్ల పరిధిలో ఆరు కేటగిరీలుగా విద్యుత్ కనెక్షన్లను విభజించారు. వీటి పరిధిలోని కనెక్షన్లన్నింటికీ ట్రూ అప్ ఛార్జీల పెంపును వర్తింపజేసింది. ఫలితంగా ప్రభుత్వానికి ధనికులపై ప్రేమను ఒలకబోయడంలో తాను ఛాంపియన్‌గా నిరూపించుకుంది.

2022 నాటి భారం షురూ!

2022 నుంచి 2023 వరకు వచ్చిన ఆర్థిక నష్టాలను భర్తీ చేయడంలో భాగంగా ట్రూ అప్ ఛార్జీలను పెంచేసింది. 2022 ఆగస్టు నుంచి 2024 డిసెంబర్ యూనిట్‌కు రూ.61 పైసలు చొప్పున పెంచేసింది. 2025 వరకు ప్రతి నెలా ట్రూ అప్ పేరిట అదనపు ఛార్జీలను వసూలు చేయనుంది. 2023 మార్చిలో 10.96 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. నెలకు ట్రాన్స్‌కో ఆదాయం రూ.70 కోట్లు వసూలైంది. 2024 నవంబర్‌లో 117 లక్షలకు పైగా యూనిట్లు వినియోగమైనట్లు తెలుస్తోంది. ఈలెక్కన జిల్లాపై సుమారు రూ.7.1 కోట్లకుపైగా భారం పడనుంది. నెలకు రూ.85 కోట్ల మేర ఆదాయం సమకూరనున్నట్లు తెలుస్తోంది.

సామాన్యులే సమిధలా..!

జిల్లా వ్యాప్తంగా బిపిఎల్ కేటగిరీ కింద ఐదు లక్షల కుటుంబాల వరకు ఉన్న సంగతి తెలిసిందే. పేదల ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు ఇటువంటి సామాన్యులను ఛార్జీల పెంపుదల నుంచి మినహాయించలేదు. జిల్లాలోని 91 వేల కమర్షియల్ కనెక్షన్లు, 4,195 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ల మీద ట్రూఅప్ ఛార్జీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడం సముచితం. ఇటువంటి ఆలోచన చేయకుండా సామాన్య విద్యుత్ వినియోగదారుల మీద ట్రూఅప్ ఛార్జీల భారాన్ని వేయడం పట్ల సర్వత్రా విమర్శల వర్షం కురుస్తోంది.

ఒక బల్బునూ ..వదలేదు..!

ట్రూ అప్ ఛార్జీల పెంపు పరిశీలిస్తే పేద, ధనిక కనెక్షన్లనే తారతమ్యం లేకుండా ఛార్జీల పెంపు అనివార్యమైంది. జిల్లాలోని కమర్షియల్, విద్యుత్ కనెక్షన్లపై ట్రూ అప్ ఛార్జీలను వసూలు చేయడానికి బదులుగా కరెంటు కనెక్షన్లన్నింటికీ ఛార్జీలను పెంచడంపై విమర్శల వర్షం కురుస్తోంది. టెలిస్కోపిక్ విధానంలో వినియోగదారులకు వాత పెట్టనుందని అర్థమవుతోంది. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు ఒక బల్బు ఉచిత విద్యుత్ వినియోగపథకానికి తిలోదకాలిచ్చాయి. ఫలితంగా జిల్లాలో లక్ష మందికిపైగా ఒక బల్బు లబ్ధిదారులు నష్టపోయారు. తాజా ఛార్జీల పెంపుదలతో దళితులపైనా భారం పడడం ఆందోళన కలిగిస్తోంది.

సర్దుబాటుతో మరింత భారం

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచడం తగదు. ప్రతి నెలా రూ.400 బిల్లుకు సర్దుబాటు ఛార్జీల బాదుడతో వంద పెరిగే అవకాశం ఉంది. సర్దుబాటు ఛార్జీలను విద్యుత్ బిల్లులకు కలిపితే భారం మోయలేం.

- రమేష్, బండివారిపల్లి, మైదుకూరు,

అదనపు భారాన్ని భరించలేం

ప్రతి నెలా రూ.300 నుంచి రూ.350 బిల్లు వచ్చేది. తాజాగా పెంచిన సర్దుబాటు ఛార్జీల కారణంగా రూ.25 అదనపు భారం పడింది.

- హరి, పట్టణవాసి, మైదుకూరు.

పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

సర్దుబాటు ఛార్జీల పేరుతో పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలి. ఉపాధి అవకాశాలు లేక బాధపడుతున్న తరుణంలో భారాలను మోపడం సరికాదు. విద్యుత్ సంస్థలకు నష్టం వచ్చిందనే పేరుతో అదనపు భారాలను మోపడం దారుణం.

- రమేష్‌రెడ్డి, పప్పనపల్లి, చాపాడు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

చింతకొమ్మదిన్నె : సదస్సులో మాట్లాడుతున్న జెసి అదితిసింగ్

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె

భూ సమస్య పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. శుక్రవారం రామచంద్రాపురం రెవెన్యూ గ్రామానికి సంబంధించి నరసయ్యగారిపల్లె అంగన్వాడీ పాఠశాల ప్రాంగణంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు తమ సమస్యను ఆమె దృష్టికి వినతి పత్రం ద్వారా తెలియజేశారు. అనంతరం అధికారులు రెవెన్యూ సదస్సుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఏవైనా భూ సమస్యలుంటే సదస్సుల ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను వారు స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ. నాగేశ్వరరావు, మండల సర్వేయర్ నాగభూషణం రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ యూనస్‌బాష, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదిరాజు, జూనియర్ సహాయకులు ధీరజ్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

చాపాడు : భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని లక్ష్మీపేట సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి అర్జీల రూపంలో తీసుకువెళ్లాలన్నారు. రైతుల నుండి వచ్చిన అర్జీలను రెవెన్యూ అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య, తహశీల్దార్ రమాకుమారి, డిటి నారాయణస్వామి, ఆర్ఐ చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గురివిరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, టిడిపి నాయకులు వేమారెడ్డి, వీర శేఖర్ రెడ్డి, నారపరెడ్డి, వీఆర్ఓ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

కాశినాయన : గ్రామాల్లోని భూ సమస్యలు పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామని తహశీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండల పరిధిలోని రంపాడు గ్రామంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు, రైతులు వివిధ భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సర్వేయర్ శ్రీకాంత్, విఆర్ఒలు పాల్గొన్నారు.

తొండూరు : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రామచంద్రుడు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణారెడ్డి, రీస సర్వే డిటి ఇ. రాజేశ్వరి, మండల సర్వేయర్లు రాఘవేంద్ర, విఆర్ఒ నాగరాజు పాల్గొన్నారు.

చెన్నూరు : మండలంలోని ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సు తహశీల్దార్ పేర్కొన్నారు. అనంతరం వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిటి వెంకటరమణ, సర్వేయర్ సోమశేఖర్, విలేజ్ సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూరోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గ్రామాల్లో పరిష్కారం కాని భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా గ్రామాల్లో ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అసం రఘురామిరెడ్డి, కౌన్సిలర్స్ జిలాన్ బాషా,గౌస్, పగిడాల దస్తగిరి, కొండయ్య పాల్గొన్నారు.

ముద్దనూరు : భూ సమస్యల పరిష్కారాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సదస్సులో రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి తెలిపారు. కొసినేపల్లె గ్రామంలో మండల ప్రత్యేక అధికారి,వరద కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. అసైన్ మెంట్ కమిటీ ఏర్పాటు చేసి భూములు మంజూరు చేయాలని 114 దరఖాస్తులు, వివిధ సమస్యలకు సంబంధించి 27 వినతులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మురళీ,సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సన్నన్న సూచించారు. శుక్రవారం మండలంలోని అగ్రహారంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను ఈ గ్రామ సభల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : మండల కేంద్రంలోని స్థానిక పెర్నపాడు గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు, తహశీల్దార్ ఇందిరా రాణి హాజరై ప్రజలు, రైతుల నుంచి వినతులు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ జగదీష్, ఆర్ఐ ప్రసన్న వ ండల స్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని గోపులాపురంలో మెప్మా పీడీ సురేష్ రెడ్డి, తహశీల్దార్ శోభన్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై అర్జీలు స్వీరరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇఒ జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ అర్జున్ ,రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు

హోంగార్డుల సేవలు అభినందనీయం : ఎఎస్‌పి

ప్రజాశక్తి - కడపఅర్బన్

పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న హోం గార్డుల సేవలు అభినందనీయమని ఎఎస్‌పి కె.ప్రకాష్ బాబు కొనియాడారు. 62వ హోమ్ గార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు నగరంలోని పెరేడ్ గ్రౌండ్ లో శుక్రవారం నిర్వహించిన వేడుకలకు ఎఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోమ్‌గార్డుల పరేడ్‌ను పరిశీలించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ హోమ్‌గార్డుల వ్యవస్థ ఆవిర్భావ నేపథ్యాన్ని వివరించారు. తొలుత టెరిటోరియల్ ఆర్మీ అని పిలువబడుతూ ఆర్మీకి సాయంగా ఏర్పాటు చేశారని తెలిపారు. వీరు సైనికులకు సహాయంగా ఉండేవారన్నారు. దేశ సైన్యానికి సాయంగా ఉన్నట్లే దేశ ఆంతరంగిక భద్రతకు పోలీసులకు సాయంగా ఉండేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎలాంటి పారితోషికం లేకుండా చేరిన వారితో ట్రాఫిక్ విభాగంలో మొదటిసారిగా సేవలను వినియోగించుకోవడం అభినందనీయమని చెప్పారు. నిబద్ధత, అంకిత భావం చూసిన తర్వాత 1946 సంవత్సరంలో మహారాష్ట్రలో హోమ్ గార్డ్స్ ఆర్గనైజషన్ ఉద్భవించిందన్నారు. అ ఇటీవల జరిగిన ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు ఎన్నికలలో, సి.ఎం బందోబస్తు విధుల్లో, తిరుమల, శ్రీశైలం, గండి క్షేత్ర ఉత్సవాల్లో క్రమశిక్షణతో, అంకితభావంతో బందోబస్తు విధులను సమర్ధవంతంగా నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. హోమ్‌గార్డులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని, పిల్లలను బాగా చదివించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడేలా చూడాలని సూచించారు. అనంతరం విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచిన హోమ్ గార్డులకు, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, హోమ్‌గార్డులు పాల్గొన్నారు.

చుక్కల భూమిని వెనక్కి తీసుకోవాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అన్వేష్

మండలంలోని చిలమకూరులోని చుక్కల భూములను గతంలో ప్రభుత్వం అనర్హులకు కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిందని, ఆ భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ యామినికి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. చిలంకూరు గ్రామానికి చెందిన పకీర్‌రెడ్డి గతంలో చిలంకూరు గ్రామానికి కరణం పని చేస్తూ ఉండేవాడని తెలిపారు. ఈ క్రమంలో పకీర్ రెడ్డి తనకున్న పలుకుబడితో సాగులో లేకున్నా చుక్కల భూములను కుమారులకు, తమ కుటుంబీకులకు రాయించుకున్నాడని తెలిపారు. 12 సంవత్సరాల సాగులో ఉన్న చుక్కల భూమిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిందని చెప్పారు. ఎటువంటి పంట లేకున్నా బీడు పోయిన భూములను గతంలో వ్యక్తిగత స్వార్థంతో తహశీల్దార్ భూములను కొందరికి కేటాయించారని పేర్కొన్నారు. ఫకీర్ రెడ్డి 700-1,2,3,304-2,996-5,976, 820,821 సర్వే నంబర్లు కలిగిన భూములను అడంగల్‌లో ఎక్కించుకొని తన కుమారులకు రాయించుకున్నాడని తెలిపారు. సర్వే నెంబరు 700-2-ఎ లో ప్రభుత్వం ఎస్టీలకు, యానాదులకు గృహాలు మంజూరు చేసిందని అన్నారు. ఆ భూమి తమదేనని పకీర్ రెడ్డి కుమారుడు ప్రతాపరెడ్డి దౌర్జన్యం చేస్తూ యానాదులను మరుగుదొడ్లు కట్టించుకోకుండా అడ్డుపడుతున్నాడని తెలిపారు. తహశీల్దార్ విచారించి అనర్హులకు కేటాయించిన భూమి వెంటనే వెనక్కు తీసుకోవాలి డిమాండ్ చేశారు. యానాది కాలనీకి కనీస వసతులు కల్పించాలని కోరారు.

ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన బిసి సంఘం నాయకులు

ప్రజాశక్తి - కడప

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను శుక్రవారం పెనుగొండలోని ఆమె స్వగృహంలో కడప జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకాని త్రివిక్రమ్ రావు జిల్లా ఉపాధ్యక్షులు రేవిళ్ళ మునిరత్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిసి భవన్‌కు కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. స్పందించిన మంత్రి బిసి భవన్‌కు కావాల్సిన సహాయ సహకారాలు తప్పకుండా అందజేస్తామని, త్వరలో తేదీని కూడా నిర్ణయించి అక్కడికి వచ్చి అన్ని విధాల సౌకర్యాలను కల్పించే పరిస్థితి కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

ఉపాధ్యాయుడి సతీమణితో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఉపాధ్యాయుడి కుటుంబానికి అండగా ఉంటాం

- మృతిపై సమగ్ర విచారణ చేపడతాం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప : రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఎజాస్ అహ్మద్ ఆకస్మిక మృతి బాధాకరం అని, మృతిపై సమగ్ర విచారణ చేపడతామని, ఇజాస్ కుటుంబానికి అండగా ఉంటామని రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్ర సాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని మృతుడు నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించి.. అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆకతాయి చేష్టలు, విద్య బుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడి ప్రాణాలు కోల్పోవడానికి కారణం అవ్వడం బాధాకరం అన్నారు. ఇటువంటి సంఘటనలు విద్యార్థి లోకానికే చెడ్డ పేరు తీసుకువస్తుందన్నారు. ఈ సంఘటనంపై ముఖ్యమంత్రి సీరియస్‌గా ఉన్నారన్నారు. అందరితో ఆప్యాయంగా, మంచిగా మాట్లాడే ఒక మంచి ఉపాధ్యాయుడు మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. అంతకు ముందు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫోన్ చేసి మృతుని కుటుంబసబ్యులను పరామర్శించి, అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు అభిమానులు పాల్గొన్నారు.

'ఎంఎస్‌ఎంఇ'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న కె. మురళీమోహన్‌రావు

ఎంఎస్‌ఎంఇ క్లస్టర్‌లోని వివిధ పథకాలను, ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ కడప ప్రాంతీయ కార్యాలయ ప్రధాన కార్యదర్శి కె. మురళీమోహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఐఎంఎ హాలులో మెగా ఎంఎస్‌ఎంఇ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్‌ఎంఇ ముఖ్య పాత్ర, క్లస్టర్‌లో ఉన్న వివిధ పథకాలను, వాటి ప్రయోజనాలను వివరించారు. ఐలా అధ్యక్షులు, చైర్మన్ జి. శేషారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను, వాటి ప్రయోజనాలను తెలియజేశారు.సమావేశంలో కడప, కడప పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది పాల్గొన్నారు. కొంతమంది కస్టమర్లకు రుణ ఆమోద పత్రాలు ఈ సందర్భంగా జారీ చేశారు. సమావేశంలో స్థానిక కెనరా బ్యాంకు శాఖల ముఖ్య అధికారులు, ప్రాంతీయ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న నాయకులు

ఎపిజిబి తరలింపు అన్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలింపు రాయలసీమ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీ సినట్టేనని ఎపి ప్రయివేట్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఐటిఐ సర్కిల్ వద్ద బ్యాంకు ప్రధాన కార్యాలయం అమరావతికి తరలించడానికి నిరసిస్తూ సిపిఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని అవసరమైన కొత్త పరిశ్రమలు ఆఫీసులు తీసుకు రావాల్సింది పోయి ఉన్న కార్యాలయాలను తలరించడం ఏ రకంగా సమం జసమని ప్రశ్నించారు. ఎపిజిబి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందిస్తోందని ఇలాంటి బ్యాంక్ ని విలీనం చేస్తున్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడాన్ని ఏమాత్రం అంగీకరి ంచకూడదని అన్నారు. జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులందరూ క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బ్యాంకును ప్రధాన కార్యాల యాన్ని ఇక్కడి నుంచే నిర్వహించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించడానికి చేస్తున్న ప్రయత్నాలు ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం కడప నగర కార్యదర్శి రామ మోహన్, కమిటీ సభ్యులు కామానూరు శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, రాజామణి, శివకు మార్, వీరపోగు రవి, నారాయణ రెడ్డి, సీపీఐ నాయకులు సావంత్ సుధాకర్, కృష్ణారెడ్డి, రాజు, సాంబశివరెడ్డి, హరిచంద్రారెడ్డి, పి.పి. గంగన్న పాల్గొన్నారు.

కడపకు తలమానికం 'శుభమస్తు'

- షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో సినీనటి మీనాక్షి చౌదరి

ప్రజాశక్తి - కడప సిటీ

కడప నగరానికి శుభమస్తు షాపింగ్ మాల్ తలమానికంగా నిలుస్తుందని, ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి, కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అర్. మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎర్రముక్కపల్లె ఎస్‌బిఐ బ్రాంచ్ ఎదురుగా శుక్రవారం వందలాది మంది అతిథుల సమక్షంలో, వేలాదిగా తరలివచ్చిన ప్రజల ఆనందోత్సాహాల మధ్య లాంచనంగా ప్రారంభించారు. షాపింగ్ మాల్ యజయానులు బయ్యా శ్రీనివాసులు, జయ్యా రవి, సినీనటి మీనాక్షి చౌదరి, ఎమ్మెల్యే ఆర్. మాదవి. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసుల రెడ్డిని ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ప్రతిష్ఠ పెరిగేలా 300 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మాల్ ఏర్పాటు చేసిన బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవి అభినందనీయులన్నారు. వారికి ఎటువంటి సహకారం కావాలన్నా అందజేస్తామన్నారు. షాపింగ్ మాల్ యజమానులు మాట్లాడుతూ ప్రజల ఆదరాభిమానాలతో 7వ శాఖను ప్రారంభించామన్నారు. రూ.99 నుంచి రూ. రెండు లక్షల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. సాధారణ ప్రజల నుంచి లక్షాధికారుల వరకు సరసమైన ధరలతో నాణ్యమైన వస్త్రాలు విక్రయించడం మా ప్రత్యేకత అన్నారు. ఈ సందర్భంగా సినీనటి మీనాక్షి చౌదరి సందడి చేశారు. షాపులో కలియ తిరుగుతూ వినియోగదారులను అలరించారు. అరుదైన సీట్ ప్రదర్శిస్తున్న జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా, రమేష్ అభిమానులతో సెల్ఫీలు ఫొటోలు దిగారు. ఆమెను చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. వేలాది మంది ప్రజలతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా జబర్తస్త టీం కళాకారులు బుల్లెట్ భాస్కర్, నాటి నరేష్, ఫైమా స్కిట్లతో అబ్బురపరిచారు. కార్యక్రమంలో భయ్యా రాణాప్రతాప్, రామరాజు కాటన్ ఫౌండర్, ఛైర్మన్ కె. ఆర్. నాగరాజన్, బిజెపి జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషన్ రెడ్డి, లయన్ కె. చిప్ప రెడ్డి పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి చౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

'కడప ఉక్కు'పై రాజకీయ పార్టీల వైఖరి తెలపాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ :

కడప ఉక్కు పైన రాజకీయ పార్టీల స్పష్టమైన వైఖరి తెలపాలని ప్రజా ఉద్యమాలలో కలసి రావాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్రం వైఖరి దారుణంగా ఉందన్నారు. పార్లమెంటులో ఆ ప్రస్తావనే తమ వద్ద లేదని తెలపడం ఘోరమన్నారు. కడప ఉక్కు విభజన చట్టంలో చట్టబద్ధంగా రాసుకున్న వాటి అమలుకు కేంద్రం ముందుకు అడుగులు పడటం లేదన్నారు. వలసలు, కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో కడప ఉక్కు వేల వందల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి కడప ఉక్కు పైన పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంటులో రాష్ట్రం లోని అధికార,ప్రతిపక్ష పార్టీల ఎంపిలు నోరెత్తక పోవడం భాదాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్షాల ఎంపీలు కడప ఉక్కు పైన తమ వైఖరి ప్రజలకు తెలపాలన్నారు. ప్రజా ఉద్యమాల లో కలసి రావాలన్నారు. కడప ఉక్కు కోసం భవిష్యత్‌లో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్, నాయకులు నరసింహ, ఇమ్రాన్, వంశీ, శ్రీకాంత్, విజిత్, రాము పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దుల రాహుల్, వీరబాబు, రవి, మాజీ నాయకులు జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 8,9,10 తేదీల్లో కడప నగరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రంలోని విద్యా రంగంలో ఉన్నవంటి సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి శ్రీకారం చుట్టడం కోసం ప్రణాళిక సిద్ధం చేసి పోరాటం నిర్వహించాలని మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మూడవసారి అధికారంలో వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్య వ్యవస్థ పూర్తిగా నాశనం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేస్తోందని చెప్పారు. ఇప్పటి యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్న వంటి గురించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడటం లేదని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. మహాభలలో విద్యార్థులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజ శేఖర్ రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాల ప్రాంతీయ సంచాలకులు శామ్యూల్ నగరంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డును వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలను పాఠశాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అవకాశమున్నంత మేరకు గ్రీనరీని పెంచాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ సమావేశాన్ని ప్రతి పాఠశాల విజయవంతంగా నిర్వహించాలన్నారు. తల్లిదండ్రులను, ప్రజా ప్రతినిధులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు చేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం ఇస్తూ కేటాయించిన రోజులు రాగి జావా, చిక్కి, గుడ్డు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలిముద్ర వేసుకో.. డబ్బులు తీసుకో

అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో రేషన్ బియ్యం పక్కదారి

ప్రజాశక్తి -ఖాజీపేట

దారిద్ర్య రేఖకు దిగువన్న కుటుంబాలు, పేదలకు ఇస్తున్న రేషన్ బియ్యం ఖాజీపేటలో పక్కదారి పడుతుంది. రెవెన్యూ అధికారులు సైతం రేషన్ డీలర్లకు కొమ్ము కాస్తున్నారు. కార్డుదారులు బియ్యం కోసం డీలర్ల వద్దకు వెళ్తే 'వేలిముద్ర వేసుకో.. బియ్యం డబ్బులు తీసుకో'అంటూ నగదు ముట్ట చెబుతున్నారు. ఈ బియ్యాన్ని సరుకు రవాణా వాహనాలలో బయట ప్రాంతాలకు తరలిస్తూ రేషన్ మాఫియాకు తెరతీస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రేషన్ వాహనంలో బియ్యం పక్కదారి పోతున్నా ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యమే అని భావిస్తూ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రేషన్ వాహనాల్లో యథేచ్ఛగా బియ్యం తరలిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజలకు ఇచ్చే బియ్యంలోనూ పెద్ద ఎత్తున కోత విధిస్తున్నారని కార్డుదారులు మండిపడుతున్నారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోకుండా వారిని వెనకేసుకొస్తూ అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెవెన్యూ అధికారులు ఒక్కో డీలర్ వద్ద ఖర్చులకోసం అని, డీలర్ నియామక పత్రం కోసం ఖర్చుల పేరుతో వద్ద కొంత నగదు తీసుకున్నారు. డీలర్ల పైన ఆరోపణలు వచ్చినా, అక్రమాలకు పాల్పడుతున్నారన్న అభియోగాలున్నా అధికారులు చర్యలు తీసుకోక పోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. అక్రమాలకు పాల్పడితే సహించనన్న ఎమ్మెల్యే మాటలు ఏమయ్యాయో అంటూ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - చాపాడు

పరిహారం ఇవ్వాలని కోరుతున్న రైతు

నాలుగు రోజులుగా ఫెంగల్ తుఫాన్ తాకిడికి మండల పరిధిలో వరి పంట నేలకొరిగి ధాన్యం వర్షానికి తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన పంటను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. విశ్వనాథపురం, సోమాపురం, సిద్దారెడ్డిపల్లి, లక్ష్మీపేట, ఖాదర్ పల్లి, చియ్యపాడు తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో 12వేల ఎకరాలలో రైతులు వరి పంటను సాగు చేపట్టారు. పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. తుపాన్ తాకిడికి చేతికి అందికొచ్చిన పంట నేలకొరిగి ధాన్యం తడవడంతో రైతులు తీవ్రంగా నష్టాలు చూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారాన్ని మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి మాగ్గి మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో 2వేల ఎకరాలలో వరి పంట నేలకొరిగినట్లు ప్రాథమిక నిర్ధారణలో గుర్తించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు విడుదల కాగానే పంట నష్టపరిహారాన్ని నమోదు చేస్తామన్నారు. తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. గిట్టుబాటు ధరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని రైతులు దళారులను నమ్మవద్దని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరని వికాస్ విహార్ మానసిక వికలాంగుల కేంద్రం ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ రాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల అంతర్జాతీయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరు కూడా విభిన్న ప్రతిభావంతులను చులకనగా చూడకూడదన్నారు. లక్ష్యాన్ని సాధించడంలో, ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో, ప్రపంచ ఆధునిక అవిష్కరణలు ఆవిష్కరించడంలో వైకల్యం అడ్డు రాదని నిరూపించిన వారు ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు. లక్ష్యసాధనలో విభిన్న ప్రతిభావంతులు ముందుండాలన్నారు రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో హనుమంత్, ఖాదర్, అహ్మాతుల్లా, ఖజా, కమ్మ గిరి ,రాముడు పాల్గొన్నారు.

సామాజిక పతనానికి సూచిక

ప్రజాశక్తి - చాపాడు

రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ విద్యార్థుల చేత హత్యకు గురికావడం సామాజిక పతనావస్థకు సూచికని ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతి విద్యార్థులు చేత గురువు హత్యకు గురికావడం శోచనీయమన్నారు. ఎజాస్ అహ్మద్ మరణం తనను తీవ్రంగా కలిసివేసిందన్నారు. నేటితరం ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని, పిల్లలను కొట్టినా, బెత్తంతో దండించినా ప్రభుత్వం ఉపాధ్యాయులను శిక్షించడం మరింత వైవిధ్యంగా తోస్తుందన్నారు. విద్యార్థులలో ఆధ్యాత్మికతను, సామాజిక విలువలను ఇతిహాసన ప్రాముఖ్యతను గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని చక్కదిద్దాల్సిన అవసరం ఉందన్నారు.

క్రైం కార్నర్

డ్రైయినేజీ సమస్యపై ఘర్షణ : ఒకరు మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

డ్రెయినేజీ సమస్యపై ఘర్షణ పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని గండి కొవ్వూరు పంచాయతీలోని దళితవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. డ్రెయినేజీ సమస్యపై దండు యోగాంజనేయులు (38), అదే గ్రామానికి చెందిన కదిరిగాళ్ల నాగార్జున గొడవపడ్డారు. మాటా మాట పెరగడంతో యోగాంజనేయులపై దాడి చేశాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడడంతో స్థానికులు వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో యోగాంజనేయులు మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య శివలక్ష్మి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్ బి.వి. కృష్ణయ్య చెప్పారు.

ఘర్షణలో మృతి చెందిన యోగాంజనేయులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

మైదుకూరు: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కొనియాడారు. మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆయన ఎంతో కష్టపడి రచించిన రాజ్యాంగం ఆధారంగా మనం నేడు నడుచుకుంటున్నామన్నారు. ఆర్థిక అసమానతలు లేకుండా చూసేందుకు ఆయన రిజర్వేషన్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, టిడిపి నాయకులు బి.ఎం. శ్రీనివాసులు, కటారి కృష్ణ, ధనపాల రవి, యుగంధర్, లాయర్ శ్రీనివాసులు, కోనా సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయల ఆవరణంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అక్బుల్‌బాషా, ఎంపిడిఒ రామకృష్ణయ్య, టిడిపి మండల అధ్యక్షులు బోరెడ్డి వెంకట రమణరెడ్డి, టౌన్ అధ్యక్షులు పాపినేని రాంబాబు, కారపురెడ్డి సంజీవరెడ్డి, అందే శ్రీనివాసులు, శెట్టి నాగరాజు, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ముద్దనూరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ పితామహుడు, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో మండల కన్వీనర్ నడమల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగయ్య, వెంకట రెడ్డి,నారాయణ, వెంకట్, ప్రతాప్, బాలయ్య, బాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట : భారత రాజ్యాంగ రూపకల్పన సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా వద్ద అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి ప్రజా సంఘాలు, రాజకీయ ప్రముఖులు, దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కేసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, మైదుకూరు నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ తదితరులు అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ మాజీ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ప్రజా సంఘ నాయకులు ఓబులేసు కత్తి, నాగరాజు, జగన్, గడ్డం నరసింహులు మాదిగ,చెన్నమ్మ, విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు లింగమయ్య ,శ్రీకాంత్, శ్రావణ్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసు దాసు, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వినయ్‌కుమార్ భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, వైసిపి నాయకులు, కాంగ్రెస్ పార్టీ మాజీ అసెంబ్లీ అభ్యర్థి పాముల బ్రహ్మానంద రెడ్డి, ఎంఆఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచికె బాబు, హస్తకళల మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, బడిగింజల చంద్ర మౌళి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, సమతా దళిత్ యునైటెడ్ కమిటీ అధ్యక్షులు జి.జె సైమన్, బుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు నల్లప్ప, దళిత నాయకులు దేవదానం, పుట్టా రవి, కిరణ్, ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల నాయకులు సుబ్బగాల్ల నరసింహులు, బొంతల ఓబులేసు, మేకల ఆంజనేయులు, రాంపుల్లయ్య, కూటమి నాయకులు, వైసీపీ నేతలు పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి, మల్కిరెడ్డి హనుమంతు రెడ్డి, నాగేశ్వర రెడ్డి, యోబు, గజ్జల లక్షుమయ్య, కె.వి.రమణా రెడ్డి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

వేంపల్లె : కుల వ్యవస్థ నిర్మూలన కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన జీవితాంతం కృషి చేశారని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు వేమా కుమార్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, మహమ్మద్, ఈశ్వరయ్య శివ, కాంగ్రెస్ నేతలు పలువురు ఉత్తన్న,నాగరాజు, రమణ, వినయ్,వెంకటేష్, మహబూబ్ బాషా, బాలం సుబ్బ రాయుడు, ఆరుసేర్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కడప : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు ఎస్. డి. విజయ జ్యోతి పిలుపునిచ్చారు. అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి, ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్య, కాంగ్రెస్ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పార్టీ నాయకులతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి అలీ ఖాన్, ఎఐసిసి కో- ఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, మల్లెం విజయభాస్కర్, ఎన్.ఎస్.యు.ఐ. జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, మల్లెం విజయ భాస్కర్, సయ్యద్ సలావుద్దీన్, మైనుద్దీన్, కుళ్లాయప్ప, హమీద్, కదిరి ప్రసాద్ గౌడ్, సిరాజుద్దీన్, ఇనామ్, గంగయ్య, హరిప్రసాద్, రఫీఖ్ ఖాన్, వెంకటరమణ, రహంతుల్లా, నాసిర్ ఖాన్, జహుర్, కమల్‌బాష పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ అన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి, తరువాత వైసిపి కడప జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు,కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణ రెడ్డి, అలీ అక్బర్, చాక్లెట్ గౌస్, మహమ్మద్ షఫీ, త్యాగరాజు,నాగేంద్రప్రసాద్, షంషేర్,రామచంద్రయ్య, నాయకులు పులి సునీల్ కుమార్,బంగారు నాగయ్య యాదవ్,దాసరి శివ, తోట కృష్ణ పాల్గొన్నారు.

కడప : అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ర్యాలీనిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఉక్కు సాధన ఐక్యవేదిక కన్వీనర్ సత్యనారాయణ అన్నారు. ఉక్కు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లో నిరసన ప్రదర్శన నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని రాష్ట్రం విభజన సందర్భంగా పొందు పరిచిందన్నారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం విడిపోయి 11 సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. మొన్న పార్లమెంటులో ఉక్కు మినిస్టర్ మాట్లాడుతూ తమ దృష్టిలో కడప జిల్లా స్టీల్ ప్లాంట్ లేదు అనడం కడప జిల్లా ప్రజలను అవమా నించడమే అని అన్నారు. జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విభజన సందర్భంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, రాములమ్మ, గురమ్మ, నీతమ్మ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, కోశాధికారి రాఘవ, సిపిఎం నాయకులు శేఖర్, శీను, లక్ష్మయ్య, ఆవాజ్ నాయకులు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్

రోగులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

-ఎమ్మెల్యే పుట్టాసుధాకర్ యాదవ్

ప్రజాశక్తి -మైదుకూరు (చాపాడు)

ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. శుక్రవారం మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రి పేద ప్రజలు వస్తుంటారని వారికి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సిబ్బంది కొరత, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న మందులు, పరికరాలపై ఆరాతీశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కరిముల్లా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసుల రెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మాజీ గ్రంథాలయ సంస్థ డైరక్టర్ ఏపి రవీంద్ర, యాపరాల చిన్న , టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎన్నిక : మైదుకూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా యాపరాల చిన్న , మోపూరి వెంకటరమణలను నియమించారు. తమపై నమ్మకం ఉంచి ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మీపేట పంచాయతీ కార్యదర్శి వెంకట నాయుడుకు శుక్రవారం ఎంపిడిఒ వీర కిషోర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. శుక్రవారం సచివాలయానికి హాజరై బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తయిన తర్వాత అతని వ్యక్తిగత పనులపై వెళ్లిపోయాడు. గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎక్కడ ఉన్నారని అడగగా అతను ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న సమావేశానికి హాజరయ్యారని ఫోన్‌లో సమాధానం ఇచ్చారు. వెంటనే ఎంఎల్‌ఎ ఎంపిడిఒను ప్రశ్నించారు. కార్యాలయంలో ఎలాంటి సమావేశం లేదని తెలిపారు. విధులలో అలసత్వం వహించిన పంచాయతీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో లక్ష్మీపేట పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడుకు గైర్హాజరుపై వివరణ ఇవ్వాలని ఎంపిడిఒ సోకాజ్ నోటీసు జారీ చేశారు.

మురుగు కాలువల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల-కడప గరుగువీధిలో మురుగు కాలువల్లో శుక్రవారం పూడిక తీత పనులు చేపట్టారు. గరుగువీధిలో మురుగు కాలువలను శుభ్రం చేయాలని అప్రాంత ప్రజలు టిడిపి మండల కార్యదర్శి పీరా సాహెబ్‌ను సంప్రదించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య కార్మికులు మురుగు కాలువలను శుభ్రం చేశారు. మురుగు కాలువలు శుభ్రం చేయడంతో రోడ్డుపైకి మురికి నీరు రాకుండా ఉండేందుకు సహకరించినందుకు అప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డికి టిడిపి నేత పీరా సాహెబ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి-వేంపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జెసిఒ చంద్రబాబు, చంద్ర శేఖర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిక్షన్ కంపెనీ, ఎల్‌ఎంఎస్ కార్పొరేట్ కంపెనీ, వికెబిఎస్ ఇంజినీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. వెల్డర్, హెల్పర్, పిట్టర్, ఆపరేటర్‌లకు ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ చదివిన నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. 18 నుండి 30 సంవత్సరాలు వయస్సు ఉన్న నిరుద్యోగులు హాజరు కావచ్చు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఉన్న వెలుగు కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాబట్టి నిరుద్యోగులు ఆధార్ కార్డుతో పాటు సర్టిఫికెట్లు తీసుకొని రావాలని కోరారు.

రేపు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : వారాంతపు సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.45 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు పులివెందుల, శిల్పారామంలో శ్రీ రాజా కళా నిలయం, పులివెందుల వారి చిన్నారులచే జానపద, వెస్ట్రన్ మొదలగు నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పాడి రైతులకు వంద శాతం రాయితీ

ప్రజాశక్తి - ముద్దనూరు

బహు వార్షిక పశుగ్రాసాల సాగుకు, గొర్రెలు, మేకలు పెంచుకునే పాడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం రాయితీ ఇస్తుందని మండల పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బహు వార్షిక పశు గ్రాసాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రైతులు 10 సెంట్ల నుండి 50 సెంట్ల వరకు బహు వార్షిక పశు గ్రాసాన్ని పెంచుకోవచ్చన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు, 5 ఎకరాలు భూమి కలిగిన ఎస్‌సి, ఎస్‌టి, చిన్న, సన్నకారు రైతులు అర్హులన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు, పొలం అడంగల్, పాసు పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్,రేషన్ కార్డు జిరాక్స్ అందజేయాలన్నారు. నీటి వసతి కలిగిన రైతులను గుర్తించి గ్రామ సభలో ఆమోదం పొందిన తరువాత కలెక్టర్ ఆమోదిస్తారన్నారు. ఆసక్తి ఉన్న అర్హులైన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఎహెచ్‌ఎలు ,పశు వైద్యులను సంప్రదించాలని డాక్టర్ కోరారు.

నేల ప్రాముఖ్యత ఎంతో గొప్పది

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నేల ప్రాముఖ్యత ఎంతో గొప్పదని మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని నిడివెలగల సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా భూములు కోతకు గురి కాకుండా తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. నేల విశిష్టత గురించి విద్యార్థులకు చక్కగా వివరించారు. ఇటీవల కాలంలో రైతులు విపరీతమైన రసాయనికి ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం వలన భూమిలో కర్బన శాతం తగ్గాయని పేర్కొన్నారు. భూమిలో కర్బనం పెంచడానికి తీసుకోవాల్సిన అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ గురుదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరు మార్పు

నేను, వాడమదుల సతీష్ తండ్రి వి. సత్తయ్య, డోర్ నెం:5-1-37, వాల్తేర్ డిపో, పెద్ద వాల్తేర్, విశాఖపట్నం, A.P.-530017. దీని ద్వారా నా కుమార్తె పేరు వి ప్రియ వర్షిణి (పాత పేరు) నుండి వాడమదుల ప్రియ వర్షిణి (కొత్త పేరు)గా మార్చాను. ఇకనుండి ఇప్పుడు ఆమెను వాడమదుల ప్రియవర్షిణి అని పిలవవచ్చు. అన్ని ప్రయోజనాల కోసం ఇలానే పేరును ఉపయోగించగలం.
వాడమదుల సతీష్.

CHANGE OF NAME

I, Peddireddiburujugadi Raghunadha Reddy (old name) H.No.1/20, Chennamrajupalli, Pendlimarri, Sangatipalle, YSR District, Andhra Pradesh My Name has been changed to Raghunatha Reddy Peddi Reddy Buruju Gari (New name) .Hereafter my name is known as Raghunatha Reddy Peddi Reddy Buruju Gari.

BALAJI COLLEGE OF EDUCATION

(Recognized by NCTE, Banglore& Affiliated to Yogivemana University, Kadapa.)
JAMMALAMADUGU-516434, Y.S.R KADAPA Dist.A.P.
B.Ed Spot & Management Quota Admissions - 2024-2025 EDCET Code:BCJM

Applications are invited for Admission into B.Ed Course 1.Mathematics 2.Physical science 3.Biological science 4.Social Science 5.English for the Academic year 2024-2025. Eligibility: Degree/P. G pass with 50% for O.C and above 40% for BC/SC/ST/PH in degreelevel.Application forms can collect from college from 09-12-2024. Last date for submission of applications 16-12-2024.sellection will be made as per the APSCHE Guidelines.

Vacancy Position	Category A Seats=69 EWS-10	Category B Seats=25

Contact : 9966844685 PRINCIPAL

IN THE COURT OF THE HON'BLE III ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA

O.S. No. 646 /2024

G. Shanmugam, S/o. Govindan, D.No. 36/410, Ashok Nagar, Chinna Chowk, Kadapa city, Y.S.R. District. ...Plaintiff

Vs

K.S. Sailaja, W/o. Prabhudas, working as Senior Assistant, O/o. Chief Engineer, Kadapa Zone (Asst., Secretary Section), Kadapa Transco Nilayam, Sankarapuram, Kadapa city. Residing at D.No. 3/570, Raja Reddy Street, Kadapa City. ...Defendant

నోటీసు

పై దావాలో వాది, ప్రతివాది అయిన మీ పై దావా మొత్తము వసూలు నిమిత్తము కోరుచు పైన కనపరిచిన కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నాడు. సదరు దావా ప్రతివాది అయిన నీ హాజరు కొరకు 19/12/2024 ఉదయం 10:30 వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు పై కన పరిచిన కోర్టులో సదరు తేదీన హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించ బడును.

//కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు//
జి. జ్ఞానప్రసాద్,
ఆర్.కేళికృష్ణ,
అడ్వొకేట్స్, కడప.

IN THE COURT OF THE MOTOR ACCIDEENT CLAIMS TRIBUNAL CUM HON'BLE IVth ADDITIONAL DISTRICT JUDGE: KADAPA

M.V.O.P.No. 541/2022

Kathi Venkata Subbaiah. ...Claimant

Vs

1. Kuldeep Sateesh Sharma, S/o. Seethal Prasad Yadav, aged about not known, but major, R/at. Uttar Pradesh State, driver of Lorry bearing No.MH14-GU-1982.
2. Kuldeep Satish Sharma, father's name not known, aged about 45 years, R/at. Sai Prakash Apartment, S.No.4, Flat No.01, Mashi Pradhkodi, Pune, Cell No.9850910591, owner of Lorry bearing No.MH14-GU-1982.

... Respondents No.1 & 2.

NOTICE TO THE RESPONDENTS No.1&2

Whereas the above claimant filed the above case against the respondents, for grant of compensation an account of injuries sustained by the claimant in Motor vehicle Accident of Lorry bearing No.MH14-GU-1982. The Hon'ble Court is hereby summoned and order notice to the respondents No. 1 and 2 in above MVOP.No.541/2022 for appearance before the above Court by person or by a Pleader on 10/12/2024 at 10.30 A.M. to answer the same, failing which the above case will be disposed of ex parte.

//By Order of the Court//
L. RAMA SANJEEVA REDDY
Advocate for Claimant,
KADAPA. Cell: 9849496506.

IIN THE COURT OF THE MACT IV th. ADDL. DISITRICT JUDGE, ANANTHAPURAMU

M.V.O.P.No: 168/2024

Between:
1. Fakrubi, 2. Fathima, 3.Afsana 4.Shameer, 5.Sofiya Nos.2 to 5 are Minors, rep, by natural guardian mother 1 petitioner ...Petitioners
and
K Saminathan and Others ...Respondants

Notice To Respondents No: 1 and 4

R1:K.Saminathan S/o Kuppu Swamy, Driver of Lorry bearing No.TN. 15-B.5445, R/o Kamaraja Nagar Street, Chitthivinayagar Koil Street, Tambaram Taluk, Kanchipuram district, Tamilnadu State.

R4: Syed Haneef, S/o Hussain Saheb, R/o Santhi Nagar, Forumamilla Road, Mydukur Town, Y.S.R.Kadapa district

Please take notice that the above claim petitioners filed the above O. P. No. 168/2024 against you and others for grant of compensation and the same is posted to 10-12-2024 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on 10-12-2024 at 10-30 a. m. in person or through an Advocate without fail. If you fail the matter will be decided exparte.

(By the order of the Court)
Sri Y.V.Pattabhi, B.Anand Kumar
Advocates, Ananthapuramu.
Cell No.9966456562.

IN THE COURT OF THE HON'BLE Addl. SENIOR CIVIL JUDGE : KADAPA

I.P.No. 32/2024

Chakrala Rajyalakshmi. ...Petitioner

Vs

1. Pokuri Yamuna, W/o P.Suresh, D.No.42/544-7-1, NGO Colony, Kadapa Dist.
2. Gagguturi Abdul Khader Basha, S/o Pakkirappa, D.No.3/37-A, Obayapalli (Vi), Vallur (M), Kadapa Dist.
3. Challa Thulasi, W/o Krishnaiah, R/o of Nabikota Sivalayam, National School Street, Kadapa City.
4. Kalakandla Ganesh, S/o Suresh AngadiVeedi, CK Dinne (M), Kadapa City.
5. Puvvada Bharathi, W/o Lakshmi Narayana, R/o of Nabikota Sivalayam, Q&Q Supermarket Street, Kadapa City.
6. Aluri Shanthi,W/o A.Venkata Prasad, D.No.10/124, Ravindra Nagar, Kadapa City.
7. G.Subbaryudu, S/o Babu Rao, Yellaturu (Vi), Pendlimarry (M), Kadapa Dist.
8. G.Sreekanth, S/o Sreenivasulu, R/o of Kondapeta (Vi), Chennur (M), Kadapa Dist.

...Respondents

పబ్లిక్ నోటీస్

పై నెంబర్ గల కేసులో పిటీషనర్ పై తెల్పిన రెస్పాండెంట్స్ పైన ఐ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఈ కేసు 23.12.2024న వాయిదా వున్నది. పై తెల్పిన పిటీషనర్ పై తెల్పిన రెస్పాండెంట్స్ పైన కాకుండా మిగతా ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై తెల్పిన తేదీన పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు ప్రత్యక్షంగా గాని పరోక్షముగా గాని ఆక్షేపణలు తెలుపవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: 23.12.2024

//By Order of the Court//
ATLURI BALA SUBBAIAH M.A., B.L.,
Advocate,
KADAPA. Cell:7891513446